నిలువెత్తు నిర్లక్ష్యం


తొలగించిన స్తంభాల చోట కూటమి నాయకుల వాహనాలను పార్కింగ్ చేసిన దృశ్యం

- మరమ్మతులకు నోచుకోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మలు
- మృత్యు కూపాలుగా కరెంట్ వైర్లు
- భయాందోళనల్లో జ్ఞానాపురం వాసులు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలోని పలు ప్రాంతాల ప్రజలు వివిధ రకాలైన విద్యుత్ సమస్యలతో బాధపడుతున్నారు. ఇక్కడి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల రక్షణ గోడలు శిథిలమై వైర్లు బయట పడుతున్నాయి. దీంతో వర్షాలు పడుతున్న ఈ సమయంలో ఎవరైనా వాటిని తాకితే ప్రమాదమని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అలాగే ట్రాన్స్‌ఫార్మర్ల రక్షణ గోడలు శిథిలమై కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. అయితే ఈ సమస్యల గురించి ఫిర్యాదు చేసినా విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వార్డు ప్రజలు వాపోతున్నారు. సెబాస్టియన్‌కాలనీ, జేఎస్ఎస్ యూఆర్ఎం కాలనీ, బాబుకాలనీ, గెడ్డవీధి, స్లీప్‌గుర్తువీధి, డయాస్‌వీధి తదితర ప్రాంతాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల రక్షణ గోడలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. కాలం చెల్లిన, సక్రమంగా బిగించని విద్యుత్ వైర్లు నేలకు రాలుతున్నాయి. ఇటీవల జ్ఞానాపురంలోని పలు వీధుల్లో విద్యుత్ వైర్లు రాత్రి వేళలో తెగిపడ్డాయి. అయితే ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. కాలం చెల్లిన ఇనుప విద్యుత్ స్తంభాలు కొన్ని ప్రాంతాల్లో తొలగించకుండా ఉండడంతో వర్షాలు పడినప్పుడు మంటలు చెలరేగడం వంటి సంఘటనలు సంభవించాయి.


సెబాస్టియన్ కాలనీలో నిర్లక్ష్యంగా వదిలేసిన శిథిలావస్థకు చేరిన ట్రాన్స్‌ఫార్మర్ సిమెంట్ దిమ్మ

పార్కింగ్ కోసమే రక్షణ కవచాల కుదింపా?

జ్ఞానాపురం పరిధిలోని పలు ప్రాంతాల్లో కొందరు నాయకుల హవా మితిమీరుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రక్షణ గిరికి వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు సపోర్ట్‌గా ఉన్న స్తంభాలను తొలగించి ట్రాన్స్‌ఫార్మర్ స్థల పరిధి తగ్గించినట్లు స్థానికులు చెబుతున్నారు. అదే ప్రాంతానికి ఎదురుగా వార్డు టీడీపీ కార్యాలయం ఉంది. తొలగించిన స్తంభాల ప్రాంతాన్ని టీడీపీ వార్డు కార్యాలయానికి వచ్చే వార్డు నాయకులు, కార్యకర్తల కార్లు, ద్విచక్ర వాహనాల పార్కింగ్‌కు వినియోగించుకుంటున్నారని పలువురు స్థానికులు చెబుతున్నారు. సామాన్య ప్రజలు విద్యుత్ సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు కూటమి నాయకుల పనులను ప్రత్యేక శ్రద్ధతో చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

మృత్యుకూపాలుగా విద్యుత్ వైర్లు..

జ్ఞానాపురంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ వైర్లు మృత్యుకూపాలుగా మారాయి. ముప్పై ఏళ్ల పైబడిన విద్యుత్ వైర్లు, జంగు పట్టిన విద్యుత్ స్తంభాలు ఇక్కడి ప్రజల పాలిట మరణ శాసనంలా మారుతున్నాయి. జ్ఞానాపురంలో దేవమాత ఉత్సవాల సమయంలో స్లీప్‌గుర్తు వీధిలోని విద్యుత్ వైర్లు ఆకస్మాత్తుగా తెగిపడ్డాయి. తేరు రావడానికి అర గంట సమయం ఉండడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం పొంచి ఉండడం వల్ల విద్యుత్ అధికారులు తక్షణం స్పందించి ఈ ప్రాంతంలో ఉన్న విద్యుత్ సమస్యలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.


స్లీప్‌గుర్తు వీధిలో ఇటీవల దేవమాత తేరు వెళ్లే ముందు తెగిన విద్యుత్ వైర్లు (ఫైల్)


కూటమి నాయకులకు కావలసినట్లు ట్రాన్స్‌ఫార్మర్ రక్షణ స్తంభాలను తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది (ఫైల్)

ప్రమాదాల నుంచి కాపాడండి



విద్యుత్ సమస్యల నుంచి ప్రజలను కాపాడాలని కోరుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ప్రమాద భరితంగా ఇనుప విద్యుత్ స్తంభాలు, కాలం చెల్లిన విద్యుత్ వైర్లు తెగిపడుతున్నా అధికారుల స్పందన అంతంతమాత్రంగానే ఉంటుంది. ప్రమాదాలు జరిగితే తప్ప స్పందించని అధికారులతో ఇబ్బందిగా ఉంది. సామాన్యులు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు కూటమి నాయకుల ఫోన్లకు బాగా స్పందిస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ సమస్యలతో సతమతమవుతున్న ప్రజలను కాపాడాలి.

– ధనాల రాజా సుందరం, కొండవీధి, జ్ఞానాపురం

స్వార్థ రాజకీయాలు చేస్తున్నారు



విద్యుత్ అధికారులు కూటమి నాయకులు, కార్యకర్తలకు ముందుగా సమాచారం అందించి అనవసరం అయిన పనులు చేస్తున్నారు. ప్రమాదకరంగా ఉన్న వైర్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు తొలగించమని ఫిర్యాదు చేసినా పెడచెవిన పెట్టారు. కూటమి నాయకుల పనులు మాత్రమే చేస్తున్నారు. ఇటీవల వార్డులో విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. ఆ ఘటనకు ముందే అధికారులకు మొరపెట్టుకున్నా స్పందించలేదు. ప్రోటోకాల్ పాటించడంలేదు. అరెస్టులు, తప్పుడు కేసులు పెట్టించడం పరిపాటిగా మారింది.

– కోడిగుడ్ల పూర్ణిమ, 41వ వార్డు కార్పొరేటర్, జ్ఞానాపురం

క్లుప్తంగా

పక్కకు ఒరిగిన భవనం


వెలంపేట దరి పువ్వుల సందులో పక్కకు ఒరిగిన భవనం

జగదాంబ: ఇటీవల కురిసిన వర్షాలకు ఓ భవనం పక్కకు ఒరిగిన ఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. జీవీఎంసీ 35వ వార్డు వెలంపేట దరి పువ్వుల సందులో జీ–ప్లస్–3 భవనం ఎడతెరిపి లేని వర్షాలకు పక్కకు ఒరిగిపోవడంతో స్థానికులు భయందోళనలకు లోనయ్యారు. దీంతో హుటాహుటిన స్థానికులు జీవీఎంసీ, వన్‌టౌన్ పోలీసులకు విషయం తెలియజేశారు. వెంటనే ఘటనా స్థలికి చేరుకున్న అధికారుల బృందం భవనంలో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. భవన యాజమానికి జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు, తహశీల్దార్ నోటీసులు జారీ చేశారు. సంఘటనా స్థలంలో ఎటువంటి రాకపోకలు, సమీప ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు.

98.86 శాతం మందికి ఆల్బెండజోల్ మాత్రలు


చిన్నారికి ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: నులిపురుగుల నివారణలో భాగంగా బుధవారం మాపప్ రౌండ్ నిర్వహించారు. బర్మా క్యాంప్, భానోజీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం, జైభారత్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు చేతుల మీదుగా నులిపురుగుల నివారణ మాత్రలను మింగించారు. ఇక్కడ ఈ నెల 12న 18 మంది చిన్నారుల్లో 16 మంది వేసుకోగా.. బుధవారం మిగిలిన ఇద్దరు చిన్నారులకు మాత్రలు వేశారు. జిల్లాలో 1 నుంచి 19 ఏళ్ల వయసు గల బాలబాలికలు 5,15,264 మంది ఉండగా.. ఇప్పటి వరకు 5,14,544 మంది చిన్నారులకు ఆల్బెండజోల్ టాబ్లెట్లను మింగించారు. ఈ మాపప్ రౌండ్‌లో 1.87 శాతం మంది పిల్లలకు మాత్రలు వేశారు. దీంతో జిల్లాలో మొత్తం 98.86 శాతం మంది పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు వేసినట్టు డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మీడియా విస్తరణాధికారి బి.నాగేశ్వరరావు, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సులకు పదోన్నతులు


స్టాఫ్ నర్సులకు పదోన్నతుల ఉత్తర్వులు అందజేస్తున్న డాక్టర్ రాధారాణి

మహారాణిపేట: ప్రాంతీయ ఆరోగ్య శాఖ కార్యాలయం పరిధిలోని ఖాళీగా ఉన్న పీహెచ్ఎన్‌టీ (పబ్లిక్ హెల్త్ నర్స్ టీచింగ్) పోస్టులను భర్తీ చేశారు. బుధవారం వైద్య ఆరోగ్యశాఖ రీజినల్ కార్యాలయంలో రీజినల్ డైరెక్టర్ డాక్టర్ పి.రాధారాణి, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌కుమార్ ఆధ్వర్యంలో జోన్–1 పరిధిలో 11 పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. పదిమంది హాజరై నచ్చిన స్థానాలను ఎంపిక చేసుకున్నారు. వీరందరికీ ఎస్సార్‌తో కూడిన పోస్టింగ్ ఆర్డర్లు అందజేశారు. ఈ కౌన్సెలింగ్ ప్రక్రియలో ఏపీ నర్సింగ్ అసోసియేషన్ విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి. గంగాభవానీ, జీవీఎస్ వరలక్ష్మి, వైస్ ప్రెసిడెంట్ దాసరి రాజేశ్వరితో పాటు శ్రీకాకుళానికి చెందిన అధ్యక్ష, కార్యదర్శులు శాంతకుమారి, త్రినాథమ్మ, కోశాధికారి సత్యవతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు ఆర్డీ, డిప్యూటీ డైరెక్టర్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

కూలిన ఇంటి గోడ


దిబ్బలపాలెంలో కూలిపోయిన ఇంటి గోడ

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 29వ వార్డు దిబ్బలపాలెంలో ఓ ఇంటి గోడ కూలింది. గత నాలుగు రోజులుగా నగరంలో కురిసిన వానలకు ఆ ఇంటి గోడలు పూర్తిగా నానిపోవడంతో కూలింది. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోయినప్పటికీ ఇంటి గోడ కూలిపోవడంతో ఆ కుటుంబ సభ్యులు నిరాశ్రయులయ్యారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

ప్రజలను మోసం చేయడమే బాబు నైజం


34వ వార్డులో ఇంటింటి ప్రచారం చేస్తున్న తోట పద్మావతి తదితరులు

అల్లిపురం: ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజం అని 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ ఆదేశాల మేరకు బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం 36వ పోలింగ్ బూత్ పరిధిలో గల తారకరామా కాలనీ, నరహరి వీధిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సమయానికి, అనుకున్న తేదీకి ప్రజలకు అందించాల్సిన పథకాలు చెప్పి మరీ అందించేవారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది వరకు వారు ఎన్నికల్లో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రశ్నిస్తే తూతూ మంత్రంగా పథకాలు ప్రవేశపెడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్నిమాంబ గుడి చైర్మన్ లండ రమణ, చౌల్ట్రీ మాజీ చైర్మన్, పార్టీ వార్డు సీనియర్ నాయకుడు లింగం శ్రీను, 36వ బూత్ కమిటీ అధ్యక్షుడు ఎ.సూరిబాబు, బూత్ సభ్యులు వెంకటరమణ, శ్రీను, రీసు శ్రీను, దూడ అప్పారావు, బి.గోవింద్, అనిల్ పాల్గొన్నారు.

33వ వార్డులో..

జీవీఎంసీ 33వ వార్డు అధ్యక్షుడు ముత్తాబత్తుల రమేష్ ఆధ్వర్యంలో బూత్ నంబర్ 75లో బుధవారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కూటమి మోసాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పచ్చిరిపల్లి రాము, సౌత్ కల్చరల్ వింగ్ అధ్యక్షుడు సూర్యనాయుడు, లక్ష్మీకాంతం, కొల్లు సత్యవతి, కృష్ణారెడ్డి, బాడుగుల శ్రీనివాసరావు, పీవీఎం రెడ్డి, కనిగిరి సంతోష్ కుమార్, ధర్మ, చోడిపల్లి శివకుమార్, పాల దామోదర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

39వ వార్డులో..

జగదాంబ: జీవీఎంసీ 39వ వార్డులో వార్డు అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్ ఆధ్వర్యంలో బుధవారం కన్వేయర్ బెల్ట్ దగ్గరున్న థాంప్సన్ స్ట్రీట్‌లో ప్రచారం చేశారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుని సంక్షేమ పథకాలు పొందాలని వివరించారు.ఈ క్యాక్రమంలో పార్టీ సౌత్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహ్మద్ యాసీన్‌బాబ్జి, సత్య, రాజేష్, మాధురి, ధనరాజ్, ప్రసాద్, నూకరత్నం, సలీం తదితరులు పాల్గొన్నారు.


థాంప్సన్ వీధిలో ప్రచారం చేస్తున్న ముజీబ్‌ఖాన్ తదితరులు


ప్రసాద్‌గార్డెన్స్‌లో ప్రచారంచేస్తున్న వార్డు అధ్యక్షుడు కనకరెడ్డి తదితరులు

35వ వార్డులో..

జీవీఎంసీ 35వ వార్డులో వార్డు అధ్యక్షుడు కనకరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు మోసపూరిత హామీలపై ప్రజలకు వివరించారు. ఈ క్యాక్రమంలో పార్టీ జిల్లా సెక్రటరీ ఆదివిష్ణురెడ్డి, సౌత్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సువార్తరాజు, సౌత్ సిటీ వాణిజ్య విభాగం సెక్రటరీ గంగాధర్, నాగిరెడ్డి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీకి ఘన నివాళి

మహారాణిపేట: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి మహారాణిపేట ప్రకృతి చికిత్సాలయంలో జరిగింది. రాజీవ్ గాంధీ మానవ సేవ జాతీయ అవార్డు గ్రహీత రూపాకుల రవికుమార్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమం శ్రీ గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో రవికుమార్ ముందుగా రాజీవ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ 18 సంవత్సరాల వయసు వారికి ఓటు హక్కు కల్పించారని, తీవ్రవాదుల దాడిలో అశువులు బాశారని అన్నారు. ప్రకృతి చికిత్సాలయంలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి చికిత్సాలయానికి చెందిన డాక్టర్ ఎస్. లక్ష్మీనారాయణ, ఎస్. మహేష్, డాక్టర్ శ్రీలక్ష్మి, పూజిత, రాము, రమణ, ఎం. గౌరీ రెడ్డి, బంగారమ్మ, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.


రాజీవ్ గాంధీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న రూపాకుల రవికుమార్ తదితరులు

ఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్ వద్దే వద్దు


ఎకో వైజాగ్ పేరిట తయారు చేసిన సంచులను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేందిరప్రసాద్

మహారాణిపేట: ఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్ వద్దని కలెక్టర్ హరేందిరప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో వైజాగ్ ఎన్జీవో ఫోరం నూతన కార్యవర్గంతో ఆయన మాట్లాడారు. సేవా కార్యక్రమాల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా సర్వతోముఖాభివృద్ధికి ఎన్జీవోలు పూర్తి స్థాయిలో కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైజాగ్ ఎన్జీవో ఫోరం అధ్యక్షులు సుబ్బలక్ష్మి, ఉపాధ్యక్షుడు డేవిడ్ రాజు, ప్రధాన కార్యదర్శి జీవీ రత్నం, కోశాధికారి మునీర్, ఎగ్జిక్యూటివ్ బాడీ మెంబర్ భాస్కర్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల సర్వీసులు క్రమబద్ధీకరించాలి

మహారాణిపేట: బోధనాస్పత్రుల్లో పని చేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని ఏపీ కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కోటేశ్వరరావు కోరారు. బుధవారం కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు మాట్లాడుతూ గత పదేళ్లుగా బోధనాస్పత్రుల్లో విధులు నిర్వర్తిస్తున్నామని, వృత్తి పరంగా అనేక సమస్యలను ఎదుర్కొంటున్నామని, కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి విధులు నిర్వర్తిస్తూ అనేక మంది నర్సులు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. హెల్త్ కార్డులతో పాటు, డీఏ, హెచ్ఆర్ఏ, మెడికల్ లీవులు, నైట్ డ్యూటీ అలవెన్సులు ఇవ్వాలని కోరారు. సత్యనారాయణ, పద్మాక్షి, శోభ, మణి పాల్గొన్నారు.

డ్రైడేతోనే దోమల నియంత్రణ

బీచ్‌రోడ్డు: ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించటం ద్వారానే దోమల నియంత్రణ జరుగుతుందని జీవీఎంసీ బయాలజిస్ట్ శివప్రసాద్‌రెడ్డి అన్నారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ డాక్టర్ సర్ రోనాల్డ్ రాస్ దోమ ద్వారా మలేరియా జ్వరం వ్యాపిస్తుందని 1897 ఆగస్టు 20న కనుగొన్నారన్నారు. దోమల వల్ల మలేరియా, డెంగీ, చికున్ గునియా జ్వరాలు, ఫైలేరియా వ్యాపిస్తుందని, దోమల నివారణతో వ్యాధుల నుంచి రక్షణ పొంద వచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్, మలేరియా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలకు శ్రీకారం


పందిరి రాట కార్యక్రమంలో పాల్గొన్న పచ్చిరిపల్లి రాము తదితరులు


దిబ్బలపాలెం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాట కార్యక్రమం నిర్వహిస్తున్న సభ్యులు, మహిళలు


గణపతిని తోడ్కొని వస్తున్న అసోసియేషన్ సభ్యులు

అల్లిపురం: శ్రీ శివ గణేష్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంట్లో భాగంగా బుధవారం ఉదయం పందిరి రాట ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 33వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు పచ్చిరిపల్లి రాము, అధిక సంఖ్యలో మహిళలు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

దిబ్బలపాలెం యూత్‌అసోసియేషన్ ఆధ్వర్యంలో

దాబాగార్డెన్స్: దిబ్బలపాలెం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 26వ వినాయక చవితి వార్షిక మహోత్సవాలకు బుధవారం శ్రీకారం చుట్టారు. మహారాణిపేట దిబ్బలపాలెం రామాలయం సమీపాన అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక మహిళలు పందిరి రాటకు పూజలు చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ గత 26 ఏళ్లుగా వినూత్న రీతిన వినాయక ప్రతిమలు నిలుపుతూ వస్తున్నామన్నారు. ఈ ఏడాది పసుపు, కుంకుమ, చందన గణపతిని వినూత్నంగా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు చిటికిరెడ్డి పవన్‌కుమార్, ఉరుకిటి గిరీష్, చందక ప్రవీణ్, పి శ్రీనివాసరాజు (రాజేష్), మన్మథ, తాడి శ్రీధర్, కళాకారుడు చంటి, బండారు లోకేష్‌కుమార్, డీటీడీసీ శ్రీను, కట్టా యశ్వంత్, తేజ, గర్రెడ్డి వరుణ్ కుమార్, అనిల్, తాటితూరి భానుకుమార్, మూర్తి, పెద్ద ఎత్తున స్థానిక మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా గణపతి ఆగమన వేడుక..

అల్లిపురం: నీలమ్మ వేపచెట్టు దరి శ్రీ గణపతి నీలమాంబ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముంబయి వంటి నగరాల్లో నిర్వహించే విధంగా గణేష్ ఆగమనం పేరిట వినూత్న కార్యక్రమం చేపట్టారు. గణపతి విగ్రహాన్ని ఆర్భాటంగా డీజే, తీన్‌మార్, రంగు రంగుల లైటింగ్స్, బాణసంచాతో గణపతికి ఆహ్వానం పలికారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, అసోసియేషన్ అధ్యక్షుడు భీశెట్టి గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీటీ బైక్ కొనుగోలుకు సాయం చేయరూ..

మహారాణిపేట: రోడ్ సైక్లింగ్‌లో పలుమార్లు స్టేట్ చాంపియన్‌గా నిలిచిన కె.వంశీకిరణ్ టైమ్ ట్రయల్ (టీటీ) బైక్ కొనుగోలుకు ఆర్థిక సాయం చేయాలని కోరుతున్నారు. రూ.8.25 లక్షల విలువైన టీటీ బైక్ కోసం ఇప్పటికే కలెక్టర్ హరేందిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ బాగ్చి సహకారం అందించారు. ఇంకా రూ.1.75 లక్షలు కావాల్సి ఉంది. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు వీలుగా టీటీ బైక్‌కు సాయం చేయాలనుకునే వారు ఫోన్ పే/యూపీఐ 6309501312, ఎస్‌బీఐ అక్కౌంట్ నం.40331718518, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఎస్‌బీఐఎన్ 0016025, పూర్ణామార్కెట్ బ్రాంచ్‌కు పంపగలరని బుధవారం ఓ ప్రకటనలో కోరారు.


వంశీ కిరణ్

హెల్త్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

దాబాగార్డెన్స్: ఏపీ స్టేట్ ఎలైడ్ అండ్ హెల్త్ కేర్ ప్రొఫెషన్స్ కౌన్సిల్ సెక్రటరీ ఆధ్వర్యంలో డిప్లమో ఎలైడ్ హెల్త్‌కేర్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కోర్సులో చేరేందుకు ఇంటర్‌లో ఏ గ్రూప్‌లో ఉత్తీర్ణత పొందినా వచ్చే నెల 8వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కోర్సులు పూర్తి చేసిన వారికి ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు తగు ధ్రువపత్రాలతో తమ కళాశాలలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 7995013421, నంబర్‌లో సంప్రదించాలన్నారు.

పేదలకు వస్త్రాల పంపిణీ

దాబాగార్డెన్స్: బుధవారం 29వ వార్డు జిల్లా పరిషత్ జంక్షన్‌లో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్, పార్టీ క్రిస్టియన్ మైనార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్ వెస్లీ, వార్డు అధ్యక్షుడు పీతల వాసు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్ తదితరులు పేదలకు వస్త్రాలు అందజేశారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి కనకల ఈశ్వర్ జన్మదినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. గుమ్మడి చంద్రమౌళి, ఆరుగుల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


పేదలకు వస్త్రాలు అందజేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్, జాన్‌వెస్లీ తదితరులు

మాతాశిశు మరణాలు సంభవించరాదు

మహారాణిపేట: ఆధునిక సాంకేతిక వైద్య పరిజ్ఞానం అందుబాటులో ఉన్నప్పటికీ మాతాశిశు మరణాలు సంభవించడం పట్ల కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ వైద్యాధికారులను నిలదీశారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూలై వరకు జిల్లాలోని వివిధ ఆస్పత్రుల పరిధిలో చోటు చేసుకున్న మాతాశిశు మరణాలపై డిస్ట్రిక్ట్ మెటర్నిటీ డెత్ సర్వేలెన్స్ రెస్పాన్స్ కమిటీ సమావేశంలో వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూలై మధ్య కాలంలో జరిగిన 3 మాతృ మరణాలపై కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ మాతృ మరణాలు ఇక ముందు సంభవించకుండా చూసుకోవాల్సిన బాధ్యత సంబంధిత ఆరోగ్య కేంద్రం మెడికల్ అధికారులపై ఆధారపడి ఉంటుందన్నారు. సంబంధిత ఏఎన్ఎం గర్భిణులకు అవసరమైన సేవలను గుర్తించి అందజేయాలన్నారు. ఇక ముందు మాతృమరణాలు జరిగితే చర్యలు తీసుకుంటామన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ హైరిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి టీకాలు, పోషకాహారం అందేటట్లు చూడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సమన్వయ ఆరోగ్య అధికారి డాక్టర్ శంకర్ ప్రసాద్, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ అప్పారావు, పీడీ రామలక్ష్మి, కేజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ, గైనకాలజిస్టు డాక్టర్ సౌమిని, విక్టోరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.ఉషాప్రసాద్, జిల్లా ఎయిడ్స్ నివారణాధికారి డాక్టర్ ఆర్.రమేష్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ లూసీ, నోడల్ అధికారి డాక్టర్ ఎస్.వి.సమత, ఎం.సత్యవతి, ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

వాసుపల్లి చేయూత


మృతుని భార్యకు నగదు అందిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డులో మృతి చెందిన చందక వెంకట్రావ్ కుటుంబానికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ చేయూతనిచ్చారు. చందక వెంకట్రావ్ కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మృతి చెందిన విషయం తెలుసుకున్న వాసుపల్లి బుధవారం ఆయన కుటుంబాన్ని పరామర్శించి మృతుని భార్య చందక పైడిరాజుకురూ. 5 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సెక్రటరీ ఆదివిష్ణురెడ్డి, సౌత్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సువార్తరాజు, మళ్ల విజయ్ తదితరులు పాల్గొన్నారు.